## కార్పొరేట్ మోడీ - ప్రపంచబ్యాంకు బాబు కార్మిక వ్యతిరేక విధానాలపై

# సెప్టెంబర్ 2 కార్మిక, ఉద్యోగ సమ్మెకు మద్దతు

ప్రజలారా ! - CPM

మంచి రోజులు తెస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ, బాబులు కార్మికులకు కాళరాత్రులు చూపిస్తున్నారు. బ్రిటీష్ పాలనా కాలం నుండి భారత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టపరమైన హక్కులన్నీ కాలరాస్తున్నారు. మరలా కార్మికులను కట్టుబానిసలుగా యజమానుల దోపిడీకి బలి చేస్తున్నారు.

**బ్రిటీష్ పాలనాకాలంలో** కార్మికులతో యజమానులు 12గంటలు పనిచేయించుకునేవారు. ఇచ్చినంత పుచ్చుకోవడమే తప్ప అడిగే హక్కులేదు. తీసేస్తే మారు మాట్లాడే అవకాశం లేదు. ప్రమాదంలో కాలుపోయినా, చేయి పోయినా ప్రమాద బీమా లేదు. చస్తే కాటికే తప్ప నష్టపరిహారమే లేదు. ఆందోళనలు, మీటింగులు నిషేధం. సంఘం పెట్టుకునే హక్కులేదు. సమ్మె చేస్తే సమ్మె చేసిన కార్మికులతో పాటు కార్మిక నాయకులపై జరిమానా విధించేవారు. క్రిమినల్ కేసులు పెట్టేవారు.

**కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులు...** బ్రిటీష్ పాలకులపై భారత కార్మిక వర్గం వీరోచితంగా పోరాడింది. అశేష త్యాగాలు చేసింది. 1926 సంవత్సరంలోనే ఏడుగురితో సంఘం పెట్టుకునే హక్కు సాధించింది. 1947 పారిశ్రామిక వివాదాల చట్టంతో ఉద్యోగ భద్రత సాధించింది.కార్మికుడు తప్పు చేసినట్లు రుజువైతే తప్ప ఉద్యోగం నుంచి తీసివేసే హక్కు యజమానికి లేకుండా పోయింది. స్వాతంత్ర్యానంతరం పెన్షన్, కార్మిక భవిష్యనిధి (పిఎఫ్), ఇఎస్ఐ చట్టం, బోనస్‌చట్టం ఇలా అనేక చట్టాలను కార్మికవర్గం పోరాడి సాధించుకున్నది.

**నేడు మోడీ ప్రభుత్వం....** కార్మికుడి ఉద్యోగ భద్రతకు ముప్పుతెస్తున్నది. కార్మిక సంఘాలు సమిష్టిగా బేరమాడే హక్కును లేపేసి యజమాని ఇచ్చింది పుచ్చుకోమంటున్నది. మహిళలు సైతం రాత్రిపూట పని చేయాలని నిర్ణయించింది. రోజుకు 8గంటలకు బదులు 12గంటల పని చేయాలంటున్నది. సంఘం పెట్టుకునేందుకు హక్కు లేకుండా చేస్తున్నది. అన్ని సమ్మెలను చట్ట విరుద్ధం చేస్తున్నది. సమ్మె చేసిన కార్మికులపై 20వేల నుంచి 50వేల వరకు జరిమానా విధిస్తానంటున్నది. 300మంది కార్మికులు లోపున్న ఫ్యాక్టరీలు మూసి వేయడానికి, కార్మికులను తీసివేయడానికి యజమానికి స్వేచ్ఛనిచ్చేసింది ఫ్యాక్టరీల్లో లేబర్ చట్టాల అమలును ఇన్‌స్పెక్షన్ చేసే అధికారం లేబర్ డిపార్టుమెంట్‌కు తీసేసింది. బ్రిటిష్ నాటి పరిస్థితులను మోడీ ప్రభుత్వం పునరుద్ధరించి కార్మికులను కట్టుబానిసలుగా మార్చేస్తున్నది.

**మోడీకి జోడీగా చంద్రబాబు కార్మికులపై దాడి ...** ఈ చట్ట సవరణలు చంద్రబాబుకు బాగా నచ్చాయి. ఇప్పటికే అనేక దఫాలు సింగపూర్ వెళ్లిన బాబుకు అక్కడ పాలకులు ఇలాగే చేయాలని చెప్పారట. కార్మికులకున్న ఉద్యోగ భద్రత తీసేయకపోతే మేము మీ దేశంలో పెట్టుబడులు పెట్టమని మోడీకి, బాబుకు విదేశీ పెట్టుబడిదార్లు చెప్పారట. కార్మికులకు సమ్మె చేసే హక్కుంటే అభివృద్ధికి ఆటంకమని ప్రపంచబ్యాంకు పదేపదే చెబుతున్న పాఠం కూడా మదిలో ఉంచుకొని మోడీ, బాబూ ఈ చట్ట సవరణకు సిద్ధమయ్యారు. బాబు ప్రదర్శనలు, ధర్నాలు కూడా నిషేధిస్తానన్నాడు.

**సర్వసంపదలు కార్పొరేట్లకే ...** గనులు, ఖనిజాలు,భూమి,నీరు, ప్రభుత్వ పరిశ్రమలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు, టెలికం, రైల్వే, పోస్టల్, రోడ్లు, పౌర విమానయానం, నీటిపారుదల, విద్య, వైద్యం, వ్యవసాయం, మందులు, రసాయనాలు, బొగ్గు,విద్యుత్, చమురు, రక్షణ ఉత్పత్తులు సహా మన దేశ సర్వ సంపదలు దేశ, విదేశీ పెట్టుబడిదార్లకు మోడీ ప్రభుత్వం దఖలు పరుస్తున్నది.

**కార్పొరేట్లకు లాభాలు-కార్మికులకు కష్టాలు- ప్రజలకు నష్టాలు ...** ఈ దుష్టవిధానాలు కార్పొరేట్లకు లాభాల పంట పండిస్తే మరోవైపు రైతులు, కార్మికులు, గిరిజనులు, దళితులు, వృత్తిదారులు ఒక్కమాటలో చెప్పాలంటే కష్టజీవులందరికీ పెను విషాదాన్ని పంచిపెడుతున్నాయి. నష్టపోయిన, కష్టాలకు గురైన ప్రజలంతా తమ కష్టాలకు, నష్టాలకు కారణాలను తెలుసుకుంటున్న కొద్దీ ఐక్యమై ఉద్యమిస్తారని దోపిడీ వర్గాలకు బాగా తెలుసు. లాటిన్ అమెరికా దేశాల్లో ప్రజలు ఈ దుష్టవిధానాలను అమలు జరిపిన పార్టీలన్నింటినీ పాతాళానికి తొక్కేస్తున్నారు. అభ్యుదయ,ప్రగతిశీల, వామపక్ష, సామ్రాజ్యవాద వ్యతిరేఖ శక్తులకు అధికారం అప్పజెప్పుతున్నారు. గ్రీస్‌లో ఈ దుష్ట విధానాలపై ప్రజలు విరుచుకుపడుతున్నారు. రేపు భారత ప్రజలు అదే దారిపడతారని ప్రపంచ దొంగల ముఠాకి తెలుసు.

**మతోన్మాదంతో కష్టజీవుల ఐక్యతను దెబ్బతీసే కుట్ర ...** అందువల్లనే ప్రజల మధ్య, కార్మికుల మధ్య, కష్టజీవుల మధ్య అనైక్యతను సృష్టించి విభజించి పాలించే బ్రిటీష్ పాలకుల నీచమైన ఎత్తుగడలకు పూనుకుంటున్నారు. అందుకు మతోన్మాద, సామ్రాజ్యవాద, జాత్యాహంకార బిజెపిని ఎంచుకున్నారు. ఒకవైపు కార్పొరేట్లకు అనుకూల, ప్రజావ్యతిరేక, దేశద్రోహ విధానాలను అమలుజరుపుతూ మరోవైపు మతోన్మాదంతో మత ఘర్షణలు సృష్టించి కష్టజీవుల మధ్య, ప్రజల మధ్య అనైక్యతను సృష్టిస్తున్నది. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా సమైక్య ప్రతిఘటన లేకుండా దోపిడీకి సహకరిస్తున్నది.

**కాంగ్రెస్ చేయలేని పని పూర్తి చేస్తున్న మోడీ ....** సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు ప్రారంభించిన కాంగ్రెస్ లోక్‌సభలో తగినంత బలంలేక అలాగే సిపిఎం వామపక్షాల ఒత్తిడి కారణంగా సంపూర్ణంగా అమలు చేయలేకపోయింది. కాంగ్రెస్ చేయలేని పనిని మోడీ నాయకత్వంలో బిజెపి చేయగలదని దేశ, విదేశీ కార్పొరేట్ శక్తులు ఒక్కటై వేల కోట్ల రూపాయలు ఎన్నికల్లో గుమ్మరించి కార్పొరేట్ మీడియాలో ప్రజలకు భ్రమలు కల్పించి పూర్తి మెజార్టీతో బిజెపి మోడీని గెలిపించుకున్నారు. మోడీ కార్పొరేట్ల రుణం తీర్చుకుంటానన్నాడు. కార్మికవర్గానికి ఉన్న సంఘటిత శక్తిని బలహీనపర్చేందుకు, కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు కార్మిక చట్టాలను మార్చేస్తున్నాడు.

**సెప్టెంబర్ 2న సమ్మెను ప్రజలంతా బలపర్చండి ....** కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా దేశ సంపద పరిరక్షణకు, కార్మిక హక్కులపై జరుగుతున్న దాడిని తిప్పికొట్టేందుకు కార్మిక వర్గం సెప్టెంబర్ 2న జరుపుతున్న దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నది. రైతులు, కూలీలతో సహా నష్టపోతున్న కష్టజీవులందరినీ కూడగట్టి మతోన్మాద బిజెపి- కార్పొరేట్ మోడీ, చంద్రబాబులకు వ్యతిరేకంగా మహోద్యమం నడపాలని కార్మికవర్గానికి సిపిఎం విజ్ఞప్తి చేస్తున్నది.

తేది : 22.07.2015

**- సిపిఎం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ**